సాక్షి నిర్మల్

ఆదివారం । 5 । జనవరి । 2025



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి 290 బస్సులు నడపనుంది. 8లో▸



ఇంటి పనులు అడ్డుకున్నారని..

ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారని జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0 / 15.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

లక్ష్మణచాంద ఎంపీడీవోకు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: స్థానిక ఎంపీడీవో రాధ శనివారం సావిత్రిబాయి పూలే 2025 ఐకాన్ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో గ్రామీణ ప్రజలకు సేవలందించినందుకు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేసినందుకు ఎంపీడీవోకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ నిర్వాహకులు ఈ అవార్డు అందజేశారు.

హమాలీల వేతనాలు పెంచాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల వేతనాల ఫైనల్ జీవోను వెంటనే విడుదల చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సివిల్ సప్లయ్ హమాలీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే లక్ష్మి, సీపీఐ సీనియర్ నాయకుడు ఎస్ఎన్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు ఫయాజ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. వెంటనే సివిల్ సప్లయ్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి, పుండలిక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్సైకి సన్మానం



షఫీ ఉల్లాఖాన్‌ను సన్మానిస్తున్న రాజేశ్ మీనా

మామడ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించి రిటైర్డయిన ఎండీ షఫీఉల్లా ఖాన్‌ను శనివారం నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు సందీప్, గోపి, సుప్రియ, సిబ్బంది ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న డీపీఎం జ్ఞాను

ఖానాపూర్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల ఆన్‌లైన్ నమోదుపై డీపీఎం కే జ్ఞాను, సీబీవో ఆడిటర్ దేవేందర్ ఆధ్వర్యంలో వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం బోజన్న, సీసీలు రమేశ్, రమేశ్, విష్ణువర్ధన్, బీక్ సింగ్, శ్యామల, వీవోఏలు తదితరులున్నారు.

8న ఉద్యోగమేళా

నిర్మల్ రూరల్: ఈనెల 8న జిల్లా కేంద్రంలోని సత్యసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పాసైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు డీఐఈవో పరశురాం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ లేదా ఒకేషనల్ కంప్యూటర్స్‌లో 70శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8074065803 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న పారాయణం



బాబా చరిత్ర వివరిస్తున్న వికాస్‌రాజ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్ లోగల అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం రెండోరోజు సాయి పారాయణం కొనసాగింది. ముందుగా షిర్డీకి చెందిన వికాస్‌రాజ్ ఆధ్వర్యంలో సాయి పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సాయిబాబా భిక్షాటన తీరు, బైజాబాయి బాబాకు చేసిన సేవ తదితర విషయాలను వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాయి దీక్షా సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, సాయి సచ్చరిత్ర రచయిత హేమాడ్ పంత్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న వేదిక





రారండోయ్.. వేడుక చేద్దాం

నిర్మల్: 'రండి...
నిమ్మనాయుడు మురిసిపోయేలా..
రాంజీగోండు మీసం మెలేసేలా..
చదువులమ్మ మనసారా దీవించేలా..
'బాదనకుర్తి బౌద్ధం' విలసిల్లేలా..
'కడెం కుండ' గుండెచప్పుడు వినిపించేలా..
మైసా తెల్లబంగారం మెరిసిపోయేలా..
కొయ్యబొమ్మ కలకాలం కొలువుండిపోయేలా..

మనదైన చరిత్రను కొత్తగా చెబుదాం. మనకే సొంతమైన సంస్కృతిని సరికొత్తగా చాటుదాం. మనవైన వంటకాలను మళ్లీ పరిచయం చేసుకుందాం. మొత్తం మీద మూడురోజుల పండుగను సంబురంగా సాగిద్దాం.. రారండోయ్..'అంటూ 'నిర్మల్ ఉత్సవాలు' పిలుస్తున్నాయి. నేటి నుంచి మూడురోజుల పాటు సాగే ఈ వేడుకలు సర్వం సిద్ధం చేశారు. స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియంలో స్టాళ్లు, స్టేజీలు, లైటింగ్ సహా అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. జిల్లా ప్రజలందరి భాగస్వామ్యంతో 'నిర్మల్ ఉత్సవాలు' విజయవంతం చేద్దామంటూ అధికార యంత్రాంగం పిలుపునిస్తోంది.

- చరిత్రను కొత్తగా చెబుదాం
- సంస్కృతిని చాటుకుందాం
- మన వంటకాలను ఆస్వాదిద్దాం
- జిల్లాలో కొత్త ట్రెండ్ సెట్‌చేద్దాం
- నేటి నుంచే 'నిర్మల్ ఉత్సవాలు'
- నిర్వహణ కోసం సర్వం సిద్ధం

చరిత్రను చాటేలా..

నిర్మల్ ఉత్సవాల్లో ప్రధానాంశం చరిత్ర. మూడు రోజుల పాటు సాగే వేడుకల్లో ప్రతిరోజూ నిర్మల్‌తో పాటు జిల్లా చరిత్రపై కచ్చితంగా కార్యక్రమం ఉండేలా ప్లాన్ చేశారు. రోజూ సాయంత్రం చారిత్రక అంశాల ప్రదర్శనలతోపాటు అనుభవజ్ఞులు, పరిశోధనలు చేసినవారితో జిల్లా ఘనమైన గతాన్ని ప్రస్తుత తరానికి తెలిపే ప్రయత్నం చేస్తున్నారు.



మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

సంస్కృతి ప్రతిబింబించేలా..

గట్ల (సహ్యాద్రి ఘాట్ల) కింద, గంగ ఇవతల (గోదావరికి ఇటువైపు) ఉన్న నిమ్మలకు తనదైన సంస్కృతి ఉంది. మహారాష్ట్రతో దాదాపు ఓ వైపంతా హద్దు కలిగి, మరోదిక్కు మంచిర్యాలతో అనుబంధం కలుపుకొని ఉంది. గంగ దాటితో నిజామాబాద్, గట్లు ఎక్కితే ఆదిలాబాద్ ఇలా.. నలువైపులా విభిన్న సంస్కృతులున్నాయి. వాటికి భిన్నంగా నిమ్మల తన పేరును నిలుపుకొంటోంది. చుట్టుపక్కల ఎక్కడా లేనివిధంగా తనకే సొంతమైన చారిత్రక వారసత్వాన్నీ కలిగి ఉంది. ఈ సాంస్కృతిక వారసత్వాన్నీ నేటి తరానికి అందించాలన్న ఉద్దేశం ఈ ఉత్సవాల్లో దాగి ఉంది. ఈమేరకు కవులు, కళాకారులు, విద్యార్థుల ద్వారా కార్యక్రమాలను నిర్వహించేలా ప్లాన్ చేశారు. ఇందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

మనవైన ఘుమఘుమలు..

వేడివేడి పిట్లా జొన్నరొట్టె తింటే.. ఎవ్వరైనా ఆహా అనాల్సిందే. భైంసా కలామ్ ఒక్కటి నోట్లో వేసుకుంటే ఎదుటోళ్లకు నోరూరాల్సిందే. ఎల్లిపాయ నూరి చేసిన కారంపూసను ఎక్కడివారైనా టేస్ట్ చేయాల్సిందే. ఇక జలసిరులున్న జిల్లాలో పెరిగిన మత్స్యసంపదతో చేసే చేపపచ్చళ్లు, వేపుళ్లు, పులుసులు వాసనతోనే చెవులూరించాల్సిందే. ఇలాంటి ఎన్నో మనవైన ఘుమఘుమలను నిర్మల్ ఉత్సవాలు అందించనున్నాయి. వేడుకలకు వచ్చిన వారందరికీ మన లోకల్ టేస్ట్ చూపించనున్నాయి.

సమష్టిగా విజయవంతం చేద్దాం

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా నిర్మల్ ఉత్సవాలను నిర్వహిద్దామని, జిల్లా ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని కలెక్టర్ అభిలాషఅభినవ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియంలో శనివారం అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి నిర్మల్ ఉత్సవాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. స్టాళ్లు, వేదిక, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. జిల్లాలో నూతన సంవత్సరంలో కొత్తగా నిర్వహిస్తున్న నిర్మల్ ఉత్సవాలను సమష్టిగా విజయవంతం చేద్దామని చెప్పారు. ఆదివారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసేలా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మల్ ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమాల వద్ద షీటీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు, కంట్రోల్‌రూమ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. నిర్మల్ ఉత్సవాలు, 'ఐ లవ్ నిర్మల్' లాంటి సెల్ఫీ పాయింట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, డీఎస్పీ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాషఅభినవ్

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి



వీసీలో పాల్గొన్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రజలందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఇతర అధికారులతో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలు, రవాణాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలపై పాఠశాలల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, ప్రాంతీయ రవాణాధికారి దుర్గాప్రసాద్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఎంవీఐ మహేందర్, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



కేక్ కట్ చేస్తున్న అంధులు, ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కొనియాడారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతిని సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అంధులతో కలిసి అదనపు కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ బ్రెయిలీ లిపి కనుగొనడంతో అంధులూ విద్య నేర్చుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ఆయన చేసిన కృషితోనే అనేక రంగాల్లో భాగస్వాములవుతున్నారని చెప్పారు. అంధులు నిరాశ చెందకుండా బ్రెయిలీ లిపిని నేర్చుకుని జీవితంలో ముందుకుసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సీడీపీవోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో శనివారం సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షాపత్రాలను డీఈవో రామారావు, ఏసీజీ సిద్ధ పద్మ, అధికారులు విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. నూతనంగా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు, కొత్త డీఎస్సీ ద్వారా నియమితులైన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు.

విజేతలు వీరే..

తెలుగు మీడియంలో కొట్టే హర్షవర్ధన్ ప్రథమ (జెడ్పీహెచ్ఎస్, మస్కాపూర్), బీ కీర్తి ద్వితీయ (జెడ్పీహెచ్ఎస్, మస్కాపూర్), రాచకొండ రాజు తృతీయ (జెడ్పీహెచ్ఎస్, జామ్), ఇంగ్లిష్ మీడియంలో మైసా నందిని ప్రథమ (జెడ్పీహెచ్ఎస్, మస్కాపూర్), విశ్వంత్ ద్వితీయ (జెడ్పీహెచ్ఎస్, కొరిటికల్), అజయ్‌కుమార్ తృతీయ (జెడ్పీహెచ్ఎస్, లక్ష్మణచాంద), ఉర్దూ మీడియంలో సయ్యద్ దోస్త్ ప్రథమ (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, నిర్మల్), సనా బేగం ద్వితీయ (జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, నిర్మల్), రిమ్సా బేగం తృతీయ (జెడ్పీహెచ్ఎస్, ఖానాపూర్) స్థానాల్లో గెలుపొందారు. వీరికి ఫోరం ఆధ్వర్యంలో నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఫోరం అధ్యక్షుడు రాపర్తి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భూషణ్, ఆంజనేయులు, నకిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్పీ నాగరాజు, వినోద్‌కుమార్, శేఖర్, శ్రీనివాస్, సిలారి మధు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షాపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, అధికారులు

భైంసాలో ఖేల్‌ఖూద్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్‌లోగల సరస్వతి శిశుమందిర్‌లో శనివారం జిల్లాస్థాయి ఖేల్ ఖూద్ పోటీలు నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్, దివంగత దిగంబర్ మాశెట్టివార్ శిశుమందిరాలకు విశిష్ట సేవలందించారని గుర్తు చేశారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాపీఠం ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రెడ్డి, పూర్వవిద్యార్థి పరిషత్ అధ్యక్షుడు హరిస్మరణ్‌రెడ్డి, మండల విద్యాధికారి సుభాష్, పాఠశాల ప్రబంధకారిణి సభ్యుడు రమేశ్ మాశెట్టివార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ సుభద్ర నిలయంలో తపస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలెండర్‌ను ఎంపీ గోడం నగేశ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆవిష్కరించారు. తపస్ నాయకులు నవీన్‌కుమార్, రాజేశ్వర్, నాగాచారి, దేవేందర్, హన్మాండ్లు, గంగాధర్, నరేశ్, వెంకటరమణ తదితరులున్నారు.

మల్చింగ్ సాగు.. బాగు

- 50శాతం సబ్సిడీతో ప్రోత్సాహం
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

మామడ: ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూల తోటలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మల్చింగ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇస్తోంది. ఎకరాకు రూ.6,400 సబ్సిడీ ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు ఉద్యాన పంటలను మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సాగు విధానం ఇలా..

పంట సాగు చేసిన తర్వాత మొక్కల చుట్టూ వేరు భాగాన్ని కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. బిందుసేద్యం, మల్చింగ్ ద్వారా పంటలు సాగు చేస్తూ రైతులు ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ పద్ధతిలో జిల్లాలో రైతులు కూరగాయలు, పూలు, పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో 50 హెక్టార్లలో రైతులు మల్చింగ్ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో మొక్కలకు ఇరువైపులా 5నుంచి 10 సెంటీమీటర్ల లోతులో గాడులు చేయాలి. మల్చింగ్‌షీట్ చివరలు గాడిలో ఉండేలా చూడాలి.

సాగుతో లాభాలివి..

మల్చింగ్ విధానంలో పంటల సాగు ద్వారా మొక్క చుట్టూ తేమ ఆవిరి కాదు. కలుపు మొక్కలు రాకుండా చేస్తుంది. 30నుంచి 40 శాతం సాగునీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి చేరకపోవడంతో కలుపు మొక్కలు నివారించబడతాయి. మల్చింగ్ సాగులో ఉన్న పంట పొలంలో వర్షం కురిసినపుడు మల్చింగ్ షీట్ కారణంగా నేరుగా భూమిపై పడకపోవడంతో మట్టికోతకు గురికాకుండా ఉంటుంది. పంటల భూసారం పరిరక్షించబడుతుంది. మల్చింగ్ పద్ధతి ద్వారా నేలలో ఉష్ణోగ్రత నియంత్రించడంతో పాటు భూమిలోపల ఉన్న క్రిమికీటకాలు, తెగుళ్లను నియంత్రిస్తుంది. నేల నిర్మాణం వృద్ధి చెంది మొక్కలకు పోషకాలు అందడంతో దిగుబడులు పెరుగుతాయని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.



కాల్వ సమీపంలో మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన బీర



దిలావర్‌పూర్‌లో..

మల్చింగ్ పద్ధతే మేలు



మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్న. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా కలుపు మొక్కలు రావడంలేదు. మల్చింగ్ పద్ధతిలో ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు పెట్టుబడి అవుతుండగా సాధారణ సాగుకు రూ.20వేల వరకు ఖర్చవుతుంది.

– హన్మంత్‌రావు, రైతు, సముందర్‌పల్లి

బొప్పాయి సాగు చేస్తున్న



నేను రెండెకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్న. బిందు సేద్యం, మల్చింగ్ పద్ధతుల ద్వారా సాగు చేస్తే మంచి లాభాలు వస్తున్నయ్. పైగా ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది. ఉద్యన పంటలు మల్చింగ్ విధానంలో సాగు చేస్తేనే రైతుకు లాభసాటిగా ఉంటుంది.

– ఎస్కే అలీ, రైతు, సిర్గాపూర్

సబ్సిడీ ఇస్తున్నాం



మల్చింగ్ విధానంలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తున్నాం. ఎకరాకు రూ.6,400 అందజేస్తున్నాం. కూరగాయలు, బొప్పాయి తదితర పంటలకు మాత్రమే సబ్సిడీ ఉంది. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి.

– మౌనిక, ఉద్యానశాఖ అధికారి, నిర్మల్ డివిజన్

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

దండేపల్లి: కడుపు నొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం..మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండ మహేశ్ (24) గత రెండేళ్ల క్రితం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున పెద్ద ఆసుపత్రిలో చూపించలేదు. దీంతో తరచూ కడుపు నొప్పితో బాధపడేవాడు. ఈక్రమంలో నొప్పి భరించలేక శుక్రవారం గ్రామ పంచాయతీ భవనం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బైక్ పైనుంచి పడి కార్మికుడు మృతి


రాజేశ్ (ఫైల్)

శ్రీరాంపూర్: అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్ ఏరియాలోని అల్లూరిసీతారామరాజునగర్‌లో నివాసం ఉండే గడికొప్పుల రాజేశ్(32) ఆర్కే 6 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లిలోని మిత్రుడు వద్దకు వెళ్లి కలిసి తన బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి ఎన్‌హెచ్ 363 సీసీసీ నస్పూర్ ఫ్లైఓవర్ నుంచి సర్వీసు రోడ్డుకు దిగుతూ బైక్ అదుపుతప్పి కాలువలో పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూసే అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇసయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


దగ్ధమైన పత్తి

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో నిల్వ ఉన్న పత్తి దగ్ధమైంది. మాజీ సర్పంచ్ డోలే చిన్నక్క సుమారు 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు చెలరేగి నిల్వ పత్తిపై పడటంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీటిని చల్లి మంటలార్పివేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకోలేకపోయారు. సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి అక్కడి యువకులు, ప్రజలతో కలిసి మంటలార్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ.10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధం కాగా, రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరింది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- ఈనెల 7 నుంచి 13 వరకు..
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 290 సర్వీసులు
- 15 నుంచి 20 వరకు జేబీఎస్‌కు తిరుగు ప్రయాణం
- 195 బస్సులను సిద్ధం చేసిన ఆర్టీసీ



మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల బస్సులను జేబీఎస్ నుంచి 7 నుంచి 13 వరకు 290 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 11 వరకు సెలవులు ప్రకటించడం, హైదరాబాద్‌కు వ్యాపార, ఉద్యోగరీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ పండుగకు సొంతూళ్లకు వెళ్తుంటారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు నడిపేలా ఆర్టీసీ యోచిస్తోంది. మహాలక్ష్మీ పథకంతో హైదరాబాద్ నుంచి వచ్చే మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను మరింత పెంచనున్నట్లు తెలుస్తోంది.

ఈనెల 7 నుంచి 13 వరకు..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో భైంసా, ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిన ఆశించిన మేర ఆదాయం రాలేదు. ఈ ఏడాది ఈనెల 10, 11న మాత్రమే ఒక్కో బస్సు సర్వీసు నడపనుంది. అత్యధికంగా నిర్మల్ డిపో బస్సులు 88, మంచిర్యాల నుంచి 82 వరకు ఉన్నాయి. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈనెల 7 నుంచి 13 వరకు బస్సులను జేబీఎస్ నుంచి గమ్యస్థానాలకు వెళ్లనున్నాయి. ఆదిలాబాద్ నుంచి 58, భైంసా-02 నిర్మల్-88 ఉట్నూర్-02, ఆసిఫాబాద్-58, మంచిర్యాల డిపో నుంచి 81 బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 10 నుంచి ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో అధిక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

తిరుగు ప్రయాణంలో కూడా..

సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణంతో రద్దీ అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చి వెళ్లేవారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సుల రాకపోకలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ డిపోల నుంచి ఈనెల 15 నుంచి 20 వరకు 195 బస్సులు నడపనున్నారు. ఆదిలాబాద్ డిపో బస్సులు 31, భైంసా 4, నిర్మల్ 71, ఉట్నూర్ 1, ఆసిఫాబాద్ 38, మంచిర్యాల 50 బస్సులను తిరుగుప్రయాణానికి వెళ్లే వారి కోసం జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులను నడపనుంది.

రద్దీకి అనుగుణంగా బస్సులు



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతాం. రద్దీ ఎక్కువగా అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలి. ప్రయాణికులకు జేబీఎస్ బస్‌స్టేషన్‌లో ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందిస్తారు.

– సోలోమాన్, ఆర్ఎం, ఆదిలాబాద్

జేబీఎస్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు బస్సుల వివరాలు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	02	0	03	02	03
08	02	0	03	02	02
09	04	0	06	04	06
10	15	01	23	15	20
11	15	01	23	15	20
12	10	0	15	10	15
13	10	0	15	10	15

ఉట్నూర్ డిపో బస్సుల రాకపోకలు: ఈనెల 10, 11న బస్సు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

తిరుగు ప్రయాణం కోసం..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
15	07	02	15	08	10
16	08	02	16	10	12
17	04	0	10	05	07
18	04	0	10	05	07
19	04	0	10	05	07
20	04	0	10	05	07

ఉట్నూర్ డిపో నుంచి ఈనెల 16న ఒక బస్సు మాత్రమే నడపనున్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్టు

బోథ్: చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గల ఈనెల 2న సూర్యవంశీ ఉలాజీ ఇంటికి తాళం వేసి చేనుకు వెళ్లాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో తన ప్యాంటు జేబులో ఉంచిన రూ. 10 వేల నగదు కనిపించలేదు. తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని పరిశీలించారు. మైనర్ ఇంటి తాళం పగలకొట్టిన వీడియో రికార్డు అయింది. శనివారం మైనర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.10 వేల నగదను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ఆయకట్టు యాసంగి పంటలకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ నవీన్ పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

చోరీకి గురైన వస్తువులు అప్పగించాలి

బెల్లంపల్లి: గతనెల 29వ రాత్రి తనపై హత్యాయత్నం చేసి చోరీ చేసిన తన వస్తువులను తిరిగి అప్పగించాలని ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనకు ప్రాణహాని ఉండటంతో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యకు శనివారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో యూనియన్ బ్యాంకు వీధిలో సెలూన్ షాప్‌వద్దకు వెళ్లగా రాగం శెట్టి సతీశ్, శ్యామ్ మరో ఆరుగురు తనపై హత్యాహత్నం చేశారన్నారు. ఆ దాడిలో తన వద్ద ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్, రూ.10,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి


ఎంపికైన క్రీడాకారులతో పార్థసారథి

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాకీలో జిల్లా ఎన్నో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. వారందరి ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకొని జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7 నుంచి నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సెలెక్టర్లు జె.రవీందర్, శ్రీనివాస్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అపార్ కార్డు, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల గ్రాంట్ల వినియోగం, సైబర్ కాంగ్రెస్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం అదనపు కమిషనర్ దామోదర్‌రావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోధ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున స్థానిక నారాయణరెడ్డి మార్కెట్‌లో గల మ్యాక్స్ మొబైల్ షాప్ తాళా న్ని ఒకరు పగులగొట్టి చోరీకి ప్రయత్నం చేస్తుండగా ఓ వ్యక్తి చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్పీ రాజేష్ మీనా, పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్సై సందీప్‌తో కలిసి ఐదు నిమిషాల్లో వెళ్లి దొంగను స్వయంగా పట్టుకున్నాడు. కేసు నమోదు చేసి, మైనర్ కావడంతో శనివారం జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ తరలించారు. ఎస్పీ జానకీ షర్మిల ఈ సందర్భంగా ఏఎస్పీని అభినందించారు.

- పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- జిల్లాకేంద్రంలో ఘటన


రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అడ్డుకున్న పోలీసులు

ఇంటి నిర్మాణ పనులు అడ్డుకున్నారని..


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్

నిర్మల్‌టౌన్: ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సోమవార్‌పేట్‌లో శక్కరి రమేశ్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీనికి అనుమతులు లేవని టీపీవో హరీశ్ తరచూ వచ్చి వేధిస్తూ పనులు అడ్డుకుంటున్నాడు. విసుగు చెందిన కుటుంబీకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పెట్రోల్ డబ్బా పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ-ప్రదీప్ బైఠాయించారు. మున్సిపల్ అధికారులు అందించిన సమాచారంతో పోలీసులకు అక్కడికి చేరుకున్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోకపోవడంతో రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. తమ సమస్య పరిష్కరించకుంటే కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుంటామని రమేశ్ తెలిపాడు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ ఖమర్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. అయినా రమేశ్ కొన్ని గంటలు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

మంచిర్యాలటౌన్: స్వామివివేకానంద జయంతి పురస్కరించుకుని రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లోని బోర్డ్స్ క్లబ్స్ ట్యాంక్ బండ్, యూత్ సర్వీసెస్ హెడ్ ఆఫీస్ ఆడిటోరియంలో నిర్వహించే పోటీలకు వెళ్లే విజేతలు రిపోర్టు చేయాలని జిల్లా యువజనుల, క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో గెలిచి ఎంపికైన విద్యార్థులు సోమవారం ఉదయం 4 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు బాక్సింగ్ కోచ్ రాజేశ్ సెల్ 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులు రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, ఏజ్ ప్రూఫ్ సర్టిఫికేట్, బోనాఫైడ్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.

ఎంపికైన వారి వివరాలు..

పోయెట్రీలో బి.శ్రీవల్లి, స్టోరీ రైటింగ్‌లో ఏ.అంజలి, పెయింటింగ్‌లో ఏ.వర్ష, సైన్స్‌ఫేర్‌లో ఇన్షా తస్నీమ్, టి.అమూల్య, గ్రూప్ ఫోక్‌డాన్స్‌లో విష్ణుప్రియ, ఎస్.అక్షయ, స్నేహితవర్మ, ఈ.అక్షయ, భవ్య, అలేఖ్య, హర్షిని, వైశాలి, శ్వేత, కె.శృతి, గ్రూప్ ఫోక్ డ్యాన్స్ జె.మౌనిక, డి.మాలతి, బి.కాంతి, దీక్షిత, డిక్లమేషన్‌లో ఆర్.సౌమ్య, ఏ.లిఖిత ఎంపికయ్యారు.

ఐదుగురు బైండోవర్

సిర్పూర్(టి): పశువుల అక్రమ రవాణాలో పట్టుబడిన ఐదుగురిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. వీరిలో రాజేందర్, సతీశ్, సారయ్య, అఫ్జల్, భాస్కర్ ఉన్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేకాటస్థావరంపై దాడులు

దహెగాం: ఎస్పీ డీవి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని ఇట్యాల శివారులో పేకాటస్థావరంపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి నుంచి రూ.35,320 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దహెగాం పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జుగ్నాక్ వంశీయుల పెర్సపేన్ పూజలు


సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని పొల్లుగూడ గ్రామంలో ఈనెల 14 నుంచి పెర్సపేన్ పూజలు నిర్వహించనున్నట్లు జుగ్నాక్ వంశం కటోడ(పూజారి) జుగ్నాక్ మహాదు అన్నారు. గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. పూజల నిర్వహణ గురించి చర్చించారు. 15న పెర్సపేన్ పూజలు నిర్వహించి గ్రామం చుట్టూ ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. 16న కుల దేవతకు పుణ్యస్నానం ఆచరించడంతోపాటు అదేరోజు రాత్రి మహాపూజ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జుగ్నాక్ వంశీయులు జుగ్నాక్ కాశీరాం, మానిక్‌రావ్, భారత్, జాలింరావ్, గ్రామపెద్దలు ఆత్రం శంకర్, భుజంగ్‌రావ్, కొరెంగా జుగాదిరావ్, మర్సుకోల నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యాబోధన తీరు గురించి పదో తరగతి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రక్త నత అరికట్టేలా విటమిన్ ‘సీ’ టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. మొవా లడ్డూ, గుడ్లు, పాలు, రాగి మాల్టా అందించాలన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

గిరిజన పోషణ మిత్ర పథకం ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలోని 60 ఆశ్రమ బాలికల పాఠశాలలు, వసతి గృహాల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. పథకం అమలుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. వారంలో రెండు సార్లు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించి నివేదికను పీవోకు అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా ఇప్పపువ్వు లడ్డూ, విటమిన్ ‘సీ’, ఐరన్ మాత్రలను ప్రతీ వారం రెండు సార్లు అందిస్తారని తెలిపారు. ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో పెంచిన కరివేపాకు, మునగ తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

‘గిరిజన పోషణమిత్ర’ పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని జామడ, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. మహువా లడ్డూతోపాటు విటమిన్ సి మాత్రలను వారంలో రెండుసార్లు విద్యార్థినులకు అందిస్తారన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఎంలు చౌహాన్ వందన, విఠల్, వార్డెన్ వనిత పవర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

9న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపా రు. హైదరాబాద్‌లోని గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో ఒక జూనియర్ కెమిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. 2023-24లో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ పూర్తయి, కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఎంపికైనవారికి ఏడాదికి రూ.2.05 లక్షల జీతం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ 9885762227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీల్వాయిలో బర్డ్‌వాక్


బర్డ్‌వాక్ నిర్వహిస్తున్న అధికారులు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎన్నో వైవిధ్యమైన పక్షి జాతులు ఉన్నట్లు రిసోర్స్‌పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీల్వాయి ప్రాజెక్టు పరిసరాలు అరుదైన పక్షులకు నిలయమని నీల్వాయి, చెన్నూర్ అటవీ రేంజర్లు అప్పలకొండ, శివకుమార్ తెలిపారు. డీఆర్వోలు ప్రమోద్‌కుమార్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న లంకా రాఘవులు

ఎదులాపురం: వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సుందరయ్య భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని, గ్రామసభల్లో అర్హులైన కూలీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు ఈ ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA25001023]

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సం॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256023]

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

■ రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ. Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15242]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602888, 9010299065, 9951602823, 9010608462,